క్లుప్తంగా

సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్ఛాపురం రూరల్: పలాస మండలంలో గురువారం నిర్వహించనున్న దివ్యాంగులు మరియు వయోవృద్ధుల బహుళ ప్రయోజన గుర్తింపు శిబిరాన్ని మండలంలోని దివ్యాంగులు, వయో వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఉచిత ఉపకరణములు అందజేసేందుకు పలాస ఎంపీడీవో కార్యాలయం వద్ద శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా అర్హులైన దివ్యాంగులకు బస్‌పాస్‌లు కూడా జారీ చేయనున్న నేపథ్యంలో సదరం ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్, ఆధార్ కార్డు, రెండు పాస్ ఫొటోలు(అంగ వైకల్యం కనిపించే విధంగా) తీసుకుని వెళ్లాలని సూచించారు.

క్రీడా సామగ్రి వితరణ


విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: మండలంలోని దంత గ్రామ యూపీ పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి వెలమల బాబుజీ రూ.10 వేలు విలువ చేసే క్రీడా సామగ్రిని బుధవారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గొండు నారాయణరావు, మండల రైతు సమాఖ్య అధ్యక్షుడు వెలమల కృష్ణారావు, పాఠశాల కమిటీ చైర్మన్ లావేటి సింహాచలం, సహాధ్యాయులు రామారావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'పేరెంట్ మీటింగ్స్ నిర్వహించాలి'

ఇచ్ఛాపురం రూరల్: మండలం, మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం తప్పనిసరిగా తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని ఎంఈవో కురమాన అప్పారావు సూచించారు. ఈ మేరకు స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో హెచ్ఎంలతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఫార్మెటివ్-1 పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో మార్కులను తల్లిదండ్రుల సమావేశంలో ప్రదర్శించాలన్నారు. పిల్లలు ఎలా చదువుతున్నారు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని స్పష్టం చేశారు. అనంతరం బూర్జపాడు, ఈదుపురం ప్రాథమిక, ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న బియ్యం వద్ద సిబ్బంది

ఇచ్ఛాపురం: అక్రమంగా రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ సిబ్బంది పట్టుకుని వాహనాలను సీజ్ చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ ఎస్పీ సురేష్‌కి వచ్చిన సమాచారం మేరకు జాతీయ రహదారి-16పై బెల్లుపడ-ఈదుపురం కూడలిలో సిబ్బంది బుదవారం మాటువేశారు. ఈ క్రమంలో ఆటోలో తరలిస్తున్న 17 బస్తాలలో 750 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఆటోని సీజ్ చేశారు. బియ్యం విలువ రూ.28,500 ఉంటుందని సీఎస్‌డీటీ సతీష్ తెలిపారు. ఒడిశాకు చెందిన బియ్యం వ్యాపారి రంగాల హరిశ్చంద్రపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ సిబ్బంది తెలిపారు.

కొబ్బరి మొక్కల పంపిణీపై సమీక్ష


అధికారులతో సమీక్షలో నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: తిత్లీ తుఫాన్‌లో నష్టపోయిన ఉద్దానం కొబ్బరి రైతులకు కొబ్బరి మొక్కలను పూర్తిస్థాయిలో అందించేందుకు కచ్చితమైన ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలోని కొత్తపుట్టుగలో ఉన్న తన నివాసంలో క్లస్టర్ ఏపీడీ కె.అమ్మినాయుడు, నియోజకవర్గ ఏపీవోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రతి రైతుకూ అవసరమైన స్థాయిలో కొబ్బరి మొక్కలు అందించాలని సూచించారు.

నృత్యంలో రాణించడం అభినందనీయం


ప్రశంసా పత్రాలతో నటరాజ నాట్యకళా మండలి కళాకారులు

సోంపేట: పట్టణంలోని నటరాజ నాట్యకళా మండలి కళాకారులు నృత్యంలో రాణించడం అభినందనీయమని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. విజయవాడ ఇస్కాన్ టెంపుల్ వారు అందజేసిన ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను నటరాజ నాట్యకళా మండలి కళాకారులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నగిరి ప్రభావతి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీను, ఉపాధ్యాయులు నగిరి శరత్, వల్లభరావు, నటరాజ నాట్యకళా మండలి శిక్షకురాలు కామేశ్వరి పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- మందసలో ఘనంగా ఆదివాసీ దినోత్సవం
- రూ.30 లక్షలతో గిరిజన భవనానికి శంకుస్థాపన


మందస: గిరిజన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: రాష్ట్రంలోని గిరిజనుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తెలియజేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మందస పట్టణంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.30 లక్షలతో గిరిజన భవన నిర్మాణానికి మంత్రి అప్పలరాజు శంకుస్థాపన చేశారు. అనంతరం గిరిజన పతాకాన్ని ఆవిష్కరించి, ఆదివాసీ మూల పురుషులు, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. గిరిజనుల జీవితాల్లో మార్పునకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. 60 ఏళ్లలో గౌతు కుటుంబం పాలనలో జరగని అభివృద్ధి నియోజకవర్గంలో నాలుగేళ్లలో జరిగిందని తెలియజేశారు. గిరిజన తెగల సంస్కృతి, సంప్రదాయాలు, భాష, లిపి రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గిరిజనులు, చిన్నారులతో కలిసి థింసా నృత్యం చేశారు. అనంతరం ఆయనను గిరిజన నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, ఎంపీటీసీ కంచి బెహరా, తహసీల్దార్ బడే పాపారావు, వ్యవసాయాధికారి జి.నాగరాజు, ఏపీఎం గౌడబ ప్రసాదరావు, ఐటీడీఏ డీఈ వంగపండు శ్రీనివాసరావు, గిరిజన నాయకులు సవర నీలకంఠం, సవర భగీరధి, శ్రీరాములు, నాగేశ్వరరావు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ అందాల శేషగిరిరావు, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సాసాద్ర ఢిల్లేశ్వరరావు, పార్టీ నాయకులు చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, సిందిరి జగన్, చింతాడ గణపతి, సవర కామయ్య తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 3వ వార్డు పెంటిపద్ర గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సవర రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతాలుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం పలాస అధ్యక్షుడు పెద్దింటి ఈశ్వరరావు, కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, సవర మోహనరావు, టెక్కలి ఉపాధ్యక్షుడు గేదెల రమణమూర్తి, చిన్నబాబు, సవరజగన్,గణేష్ పాల్గొన్నారు.

కంచిలి: మండలంలోని నువాగడ కాలనీ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్ఎం దుర్గాప్రసాద్ పాడి ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు. ఇతర ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


కాశీబుగ్గ: ఆకట్టుకుంటున్న విద్యార్థినుల నృత్యాలు


కాశీబుగ్గ: నృత్యం చేస్తున్న గిరిజనుల మహిళలు

రూ.లక్ష ఆర్థిక సాయం అందజేత

కాశీబుగ్గ: ఇటీవల అకాల మరణం చెందిన వైఎస్సార్‌సీపీ అభిమాని రఘుపాత్రుని రామణమూర్తి కుటుంబానికి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తన వంతుగా రూ.లక్ష ఆర్థిక సాయం బుధవారం అందజేశారు. రాష్ట్ర కళింగ కోమటి సంక్షేమ సంఘం చైర్మన్ అందవరపు సూరిబాబు, ఏఎంసీ చైర్మన్ పీవీ సతీష్ చేతులమీదుగా నగదు అందించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


కంచిలి: మొక్కలు నాటుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు


మందస: మొక్కలు నాటుతున్న గ్రీన్ ఆర్మీ ప్రతినిధులు

కంచిలి: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని పురుషోత్తపురం పంచాయతీ పరిధి బురదపాడు గ్రామంలో సర్పంచ్ పైల తులసి, ఆమె భర్త మోహన్‌రెడ్డి సొంత నిధులతో రాజమండ్రి నుంచి తెప్పించిన 20 మొక్కలను ఎంపీపీ చేతులమీదుగా గ్రామ మైదానంలో నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మందస: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడంతో పాటు సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ అన్నారు. మండలంలోని దున్నవూరు పంచాయతీ మొగిలిపాడు, సొండిపూడిలలో బుధవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ ప్రధాన కార్యదర్శి బి.తిరుమల, అమ్మరామకృష్ణ, సభ్యులు నగిరి కరుణాకర్, నూకల హేమసుందర్ పాల్గొన్నారు.

త్వరలోనే కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ప్రారంభం

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- నీలావతిలో గడప గడపకూ మన ప్రభుత్వం


మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

పలాస: ఉద్దానం ప్రాంత ప్రజలకు అత్యంత అవసరమైన కిడ్నీ రీసెర్చ్ సెంటర్, మంచినీటి ప్రాజెక్టును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా త్వరలోనే ప్రారంభిస్తామని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని నీలావతి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ సాసాద్ర పద్మావతి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ.. రూ.90 కోట్లతో రీసెర్చ్ సెంటర్, రూ.765 కోట్లతో నిర్మించిన ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు ద్వారా వంశధార జలాలను ఇంటింటికీ అందించే కార్యక్రమం త్వరలో జరుగుతుందన్నారు. నీలావతి గ్రామంలో నాడు-నేడు కింద రూ.25 లక్షలతో పాఠశాల అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైల చిట్టిబాబు, ఏఎంసీ చైర్మన్ పి.వి.సతీష్, నాయకులు కోరాడ ధనరాజ్, సాసాద్ర వీరాస్వామి, దువ్వాడ రవి, జినడ సీతారాం, సైని దేశయ్య, జి.మోహన్‌రావు, రాపాక చిన్నారావు, కొర్ల సంతు, చింతాడ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళులు

పలాస: మండలంలోని చిన్ననీలావతిలో గద్దర్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు, కవులు మాట్లాడుతూ.. ప్రజాయుద్ధనౌక గద్దర్ ఆటపాటలే తమకు ఆదర్శమని పేర్కొన్నారు. సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్షుడు రాపాక ధనరాజు అధ్యక్షతన జరిగిన సభలో కళాకారులు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ఏడాది జనవరి 11న నీలావతిలో జరిగిన జానపద కళాజాతరలో గద్దర్ పాల్గొని ప్రజలను ఉర్రూతలూగించారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జానపద సాహిత్య కళావేదిక కార్యదర్శి బత్తిన రామారావు, రేలా రేలా జానకిరావు, డప్పు శ్రీను, దున్న రామారావు, మామిడి కృష్ణారావు, బొడ్డు గాంధీ, దాసరి తాతారావు, కుత్తుం వినోద్, గొరకల లోకేశ్వరరావు, అందాల కోటేశ్వరరావు, బత్తిన లక్ష్మణ్ పాల్గొన్నారు.

● 75 ఏళ్ల స్వాతంత్య్రానికి గుర్తుగా...!

దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని గ్రామాల్లో నా మట్టి - నా దేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని అధికారులు పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా పలు గ్రామాల్లో స్వాతంత్య్ర సమరయోధులకు గుర్తుగా శిలా ఫలకాలను బుధవారం ఏర్పాటు చేశారు. 75 ఏళ్ల స్వాతంత్య్రానికి ప్రతీకగా 75 మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పలుచోట్ల విశ్రాంత ఆర్మీ ఉద్యోగులను సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్


కోటబొమ్మాళి: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో పణీంద్రకుమార్ తదితరులు


టెక్కలి: మొక్కలు నాటుతున్న ఆదిత్య కాలేజీ విద్యార్థులు


కవిటి: ఆర్.బైరిపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం


సోంపేట: పలాసపురంలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం


ఇచ్ఛాపురం రూరల్: పాయితారిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ బోర పుష్ప తదితరులు

రాష్ట్రంలో సంక్షేమ పాలన


లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- జలంత్రకోట పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం

కంచిలి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని జలంత్రకోట సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధ వారం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భాగ్యవతి పండా, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, వైఎస్సార్‌సీపీ నేత ప్రకాష్‌చంద్ర పండా తదితరులు పాల్గొన్నారు.

'మహిళలకు రూ.లక్ష వ్యక్తిగత రుణం'


మాట్లాడుతున్న రీజనల్ చీఫ్ మేనేజర్ సింహాచలం

ఇచ్ఛాపురం రూరల్: ఆర్థికాభివృద్ధి సాధించేందుకు స్వయం సహాయక సంఘాల్లోని ప్రతీ మహిళకు రూ.లక్ష వరకు వ్యక్తిగత రుణం అందించేందుకు తమ బ్యాంకు సిద్ధంగా ఉందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జిల్లా రీజనల్ చీఫ్ మేనేజర్ వై.సింహాచలం తెలియజేశారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండలం, మున్సిపాలిటీకి చెందిన వీవోలతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న కృషి మహిళా వికాస్ కార్యక్రమంలో భాగంగా 'అబ్ నారీక బారి' పథకం ద్వారా ఈ రుణాన్ని అందజేయనున్నామన్నారు. ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీ పరిధిలోని 510 ఎస్‌హెచ్‌జీలకు రూ.32 కోట్లు వరకు రుణాలను అందజేయడం జరిగిందన్నారు. సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ సుబాస్ శేఖర్ బెహరా, ఫీల్డ్ ఆఫీసర్ ప్రిన్స్‌రోయ్ మహంతి, ఏపీఎం సనపల ప్రసాదరావు, మెప్మా సీవో పి.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన విధానాలతో అధిక దిగుబడులు


ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచిలో అవగాహన కల్పిస్తున్న ఏవో భార్గవి


కవిటి: రైతులకు నాట్లుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కవిటి: రైతులు వ్యవసాయంలో నూతన విధానాలు అవలంభిస్తే అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు అన్నారు. మండలంలోని పుటియాదళ రెవెన్యూ గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. నాట్లు వేసేటపుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రధాన పొలంలో దమ్ము చేసేటప్పుడు నీటి పరిమాణం, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. నాట్లు వేసేటపుడు నారు చిగుళ్లను తుంచివేయడం ద్వారా తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ సిబ్బంది మాదిన సమన్వయి, బెందాళం శ్రీకళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

నాట్లు సమయంలో చిగుళ్లు తుంచివేయాలి

ఇచ్ఛాపురం రూరల్: వరినాట్లు వేసే సమయంలో నారు చిగుళ్లు తుంచడం వలన పలు తెగుళ్లను నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి టి.భార్గవి అన్నారు. మండలంలోని తేలుకుంచి రైతు భరోసా కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వరిలో 33 కుదుళ్లు వచ్చే విధంగా నాట్లు వేయడం, కాలిబాటలు తీయడం వలన సరైన గాలి, వెలుతురు తగిలి అధిక దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు ప్రవీణ్, రైతులు మేరుగు సూర్యనారాయణ, మేరుగు మరికృష్ణ, కొణతాల దివాకర్‌రెడ్డి, మేరుగు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

మోనోజైట్ నిక్షేపాలకు అన్వేషణ

సాక్షి, న్యూఢిల్లీ: పశ్చిమగోదావరి కుమ్మరపురుగుపాలెం, శ్రీకాకుళం జిల్లా కవిటిలో తీర ప్రాంతాల్లో మోనోజైట్ నిక్షేపాలు గుర్తించడానికి అన్వేషణ చేస్తున్నట్లు పీఎంవో సహాయమంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. లోక్‌సభలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ బి.వి.సత్యవతి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఇన్-సిటు మోనోజైట్ 13.07 మిలియన్ టన్నుల నిక్షేపాలున్నాయని ప్రకటించారు.

పంది దాడిలో వృద్ధురాలికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని తొలుసూరుపల్లి పంచాయతీ పరిధి ధర్మనీలాపురం గ్రామానికి చెందిన చీమల అమ్మన్న అనే వృద్ధురాలిపై బుధవారం పిల్లల పంది దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. వృద్ధురాలు పశువుల శాలలో పనిచేస్తుండగా అటుగా వెళ్తున్న పంది దాడి చేసింది. ఇది గుర్తించిన స్థానికులు పంది నుంచి అమెను రక్షించి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అమె పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించనున్నట్లు తెలించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ఇచ్ఛాపురం: పట్టణంలోని 23వ వార్డు బెల్లుపడ కాలనీలో వార్డు కౌన్సిలర్ గువ్వాడ ప్రదీప్‌కుమార్ తండ్రి ఎలియా జన్మదినం పురస్కరించుకొని బుధవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జెమ్స్ ఆస్పత్రి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు పెద్దలు దిలీప్, గవరయ్య, అయ్యప్ప, దివాకర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బీరువా వితరణ

టెక్కలి: పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గుజ్జు సూర్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం మండలంలోని గూడేం ప్రాథమిక పాఠశాలకు బుధవారం బీరువాను వితరణగా అందజేశారు. తండ్రి జ్ఞాపకార్థం కుమారుడు ధనుంజయ్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులు వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.సంతోషమ్మ, హెచ్ఎం నాగయ్య పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు

సంతబొమ్మాళి: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి అన్నారు. మండలంలోని హనుమంతునాయుడుపేట ఎంపీపీ స్కూల్‌లో పనిచేసిన ఉపాధ్యాయుడు పి.రాజు బదిలీపై వెళ్లడంతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాల మహాలక్ష్మి, ఎంఈవో జలుమూరు చిన్నవాడు తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం నేడు

సోంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బెందాళం వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరవ్వాలని కోరారు.

రూ.10 వేల ఆర్థిక సాయం

కాశీబుగ్గ: మున్సిపాలిటీకి చెందిన సకలాభక్తుల గిరిధర్‌కు ప్రమాదం జరిగి మంచానికే పరిమితమవ్వడంతో, సోంపేటకు చెందిన రోటరీ క్లబ్ సభ్యులు బుధవారం రూ.10 వేల ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలని నిరసన

కాశీబుగ్గ: రైతుల కోసం తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరుతూ కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద కార్మిక, రైతాంగ, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో లిబరేషన్ నాయకులు పాల్గొన్నారు.

'మోదీని గద్దె దించుదాం'

టెక్కలి: క్విట్ ఇండియా స్ఫూర్తితో నరేంద్రమోదీని గద్దె దించుదామని టెక్కలిలో పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహించి ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐతో పాటు పలు ప్రజా సంఘాలకు చెందిన నాయకులు ఎస్.షణ్ముఖరావు, బగాది వాసు, బి.ప్రభాకరరావు, వై.గోపి, హెచ్.ఈశ్వరరావు, ఎం.గోపాల్, బి.కృష్ణ, లక్ష్మణరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.